విట్టుబాబు
టీ శతకం

కవి తల్లిదండ్రులు

కీ॥శే॥ పంతుల భాస్కరరావు,
పంతుల జయలక్ష్మి

భద్రగిరి-ధ్రువకోకిల సాహిత్య బృందం

టీ శతకం

-:: రచన ::-

విట్టుబాబు

భద్రగిరి-ధ్రువకోకిల సాహిత్య బృందం

టీ శతకం

తెలుగు కవిత్వం

కవి : విట్టుబాబు

సర్వహక్కులు రచయితవి

ప్రథమ ప్రచురణ : జూలై 2019

కాపీలు : 500

వెల : 40 రూపాయలు

సమర్పణ : భద్రగిరి-ధ్రువకోకిల సాహిత్య బృందం

ప్రతులకు : పి. విట్టుబాబు

ఎస్ -3, సాయికళ్యాణ్ అపార్ట్‌మెంట్స్

రోడ్డు నెం. 4, ఆర్.కె.హెచ్. కాలనీ,

డా.ఎ.ఎస్‌రావు నగర్, హైదరాబాద్ - 500 062

చేబలుకు : 85550 82034

డి.టి.పి. : వేణుగ్రాఫిక్స్, భద్రాచలం

ముద్రణ :

మెట్రోప్రింటర్స్, విజయవాడ, 92464 95733,

అంకితం

ఈ రోజు నేను ఏమైనా వ్రాయగలుగుతున్నానంటే, అది చిన్నప్పుడు పడిన పునాదే అని చెప్పవచ్చు. మా నాన్నగారు కీ॥శే॥ పంతుల భాస్కరరావు గారికి సంగీతంలో ప్రవేశం ఉంది. భజన గీతాలు, కీర్తనలు వ్రాసేవారు. నేను పెరిగిన ఊరైన విజయనగరంజిల్లా నెల్లిమర్లలో భజన బృందం నడిపేవారు. అప్పట్లో ప్రతి ఊళ్ళోను భజనబృందాలుండేవి. అయితే మా నాన్నగారు వ్రాసిన గీతాలలో తప్పని సరిగా ప్రాసలను, యతులను పాటించే వారు. దాంతో వారి గీతాలు విలక్షణంగా ఉంటూ జిల్లా మొత్తంమీద పేరు సంపాదించారు. విశాఖపట్నం దాకా వారి అభిమానులు ఉండేవారు. అలా ఇంట్లో నిరంతరం సంగీతసాహిత్యాలలో మునిగి తేలుతూ ఉండడం వలన నాకు కొంత పదజ్ఞానం, లయజ్ఞానం, సంగీత జ్ఞానం వచ్చాయి.

ఇక మా అమ్మగారు శ్రీమతి పంతుల జయలక్ష్మిగారు ఇంటి పాలనాబాధ్యతను మోస్తూ మా నాన్నగారు వారి మార్గంలో ప్రయాణించడానికి ఎంతో తోడ్పడ్డారు. ఎప్పుడూ ఇంటికి నాన్నగారి శిష్యులు వస్తూ పోతూ ఉండేవారు. వారందరినీ అమ్మలా ఆదరిస్తూ ఉండేవారు మా అమ్మగారు. వీరి కుమారుడిగా జన్మించడం నా అదృష్టం. ఈ నా తొలి పుస్తకం ప్రచురింపబడుతున్న ఈ సందర్భంలో మా నాన్నగారు లేకపోవడం నాకు తీరని లోటు.

ఈ నా టీ శతకం పూజ్య తల్లిదండ్రులిరువురికీ అంకితం.

ఎన్.సి.హెచ్. చక్రవర్తి

భద్రాచలం.

టీ ఆస్వాదిద్దాం రండి !

ఇది శతకాల కాలం. యువకవులు శతకాలు వ్రాయడానికి ఇష్టపడుతున్నారు. శ్రీశ్రీ ఏ ముహూర్తాన అన్నారో కానీ **కాదేదీ కవితకనర్హం** అన్నదాన్ని నిజం చేసి చూపుతున్నారు నేటితరం కవులు. దానిలో భాగంగానే కోట్లమందికి ఉత్సాహాన్నిస్తూ, కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న **టీ** ని విషయంగా తీసుకుని విట్టుబాబు శతకాన్ని వ్రాశాడు.

నా మిత్రుడు నారాయణ మా సాహిత్య వాట్సప్ బృందంలో కాఫీ శతకం వ్రాస్తుండగా చూచి కొత్త ఆలోచనతో విట్టుబాబు టీకి అన్యాయం జరుగకుండా బాలెన్స్ చేశాడు. ఇద్దరినీ ప్రోత్సహిస్తూ మా **భద్రగిరి ధ్రువకోకిల** బృందం చేసిన శతక సేవ గొప్పదే ! ఆ బృందాల స్థాపకులు నా శిష్యుడు భద్రాచలం ప్రసాద్, ఖమ్మం హవీలా. వారికి కూడా ఈ క్రెడిట్ దక్కుతుంది.

ఒకటి పాశ్చాత్యమూ, ఒకటి చైనీయమూ, అయినా రెండూ దేశీయాలు అన్నంతగా మన జీవన స్రవంతిలో కలిసిపోయాయి. మరో విశేషం ఏమిటంటే **కాఫీ, టీ** శతకాలు రెండూ ఒకే వేదిక పంచుకుని ఆవిష్కరణ చెయ్యాలనుకోవడం. ఇది మా **భద్రగిరి ధ్రువ కోకిల** నిర్ణయం. ఇందుకు మా నారాయణ, విట్టుబాబులు అంగీకరించడం.

టీ శతకం విషయానికి వస్తే విట్టుబాబు నాకు బృందాల్లో పరిచయం అయి అతికొద్దికాలంలో ఆత్మీయుడు అయ్యాడు. సాహిత్య బృందాల ద్వారా నాకు ఎందరో ఆప్తులయ్యారు. అందులో ఒకడు విట్టుబాబు. చక్కగా పద్యం వ్రాస్తాడు. బహు చమత్కారి. నిజంగా **విట్టు**బాబే !

అతడు ఉన్న అన్ని బృందాలలో తాను ఉత్సాహంగా పాల్గొనడమే కాక బృందం మొత్తాన్ని హుషారుగా ఉంచుతాడు. ఇది యువతకు ఉండదగిన లక్షణం. మీదు మిక్కిలి నేర్చుకునే ఆసక్తి, తెలుసుకుంటూ స్వీకరించే గుణం విట్టుబాబులో మెచ్చదగిన గుణం. పెద్దల యెడ వినయ సంపన్నుడు. మద్రాస్ నుండి భద్రాచలం వచ్చి 3 రోజులు ఉండి మా సాహిత్య పాఠాలు విని ఆనందించిన ఔత్సాహికుడు. అన్నిటిలోకి ఇది గొప్ప. ఈ కాలంలో వ్రాసే యువతకు ఈ వినే ఓపిక, నేర్చుకునే తీరికలు లేవు.

ప్రసక్తానుప్రసక్తంగా నేటి సాహిత్యరంగం తీరు తెన్నులను ప్రస్తావించక తప్పదు. వ్రాయడానికి అధ్యయనం ముఖ్యం. ఆ చదువును వదిలేశారు. చేటెడు చదివి చారెడు వ్రాయాలి. ఏమి అధ్యయనం చెయ్యక చేటెడు వ్రాస్తున్నారు. తోచినదేదో వ్రాసి అదే కవిత్వం అంటున్నారు. అనుకోమంటున్నారు. పైగా అదే సాహిత్యంలో అభ్యుదయం అంటున్నారు. సత్కారాలు, శాలువలు, అవార్డుల పిచ్చి బాగా ముదిరిపోయింది. ఆశ్చర్యకరంగా అవార్డ్స్ పొందుతున్నవారి కవిత్వ స్థాయి చాలా తక్కువగా ఉంటుంది. అయినా పరస్పర సహకార పద్ధతిలో సమ్మానాలు జరిగిపోతూ ఉన్నాయి. ఇలాంటివి సాహిత్య రంగాన్ని మలినపరుస్తూ ఏవగింపు కలిగిస్తున్నాయి. కచ్చితంగా ఇది తెలుగుబాసకు మేలు చెయ్యదు. తెలుగు కవిత్వాన్నీ పలుచన చేస్తుంది. వాసితగ్గి రాశి ప్రాధాన్యం పెరిగిపోతుంది.ఒక్క వేమన శతకం, ఒక్క కాళహస్తీశ్వర శతకం, ఒక్క దాశరథి శతకం వందల ఏండ్లుగా ఏ విధంగా తెలుగు భాషా సాహిత్యాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించి అందరి నోళ్ళల్లో ఇప్పటికీ నానుతున్నాయో గ్రహించాలి. రాశి పోసినంత మాత్రాన సాహిత్యం నిలుస్తుంది అనుకోవడం భ్రమ. అవార్డులకు మనం అలంకారం కావాలి కానీ అవార్డులు మనకు అలంకారం కాకూడదు. అలా అనుకున్నంత కాలం యువత వాటికై వెంపర్లాడరు. సాహిత్య స్థాయిని తగ్గించరు. యువత ఈ విషయంలో చైతన్యవంతులు కావాలి. సాహిత్యబృందాలు ఎంతమేలు చేస్తున్నాయో దిశా నిర్దేశం లేక కొంత ఇబ్బందిగానూ ఉన్నాయి.

ప్రస్తుతానికి వస్తే మా విట్టుబాబు సహృదయుడూ వినయ సంపన్నుడూ అభ్యాసశీలి అంతోయింతో పద్యం చక్కగా వ్రాసే శక్తిసంపన్నుడు కనుక ఈ ముక్కలు ఇందులో నేను ప్రస్తావించ గలిగాను.

టీ శతకంలో పద్యాలు అన్నీ ఆహ్లాదకరంగా సాగాయి. నిజంగా ఆనందాన్ని కలిగిస్తాయి. హాయిగా చదివింపచేస్తాయి. ఇలాంటి సరదా శతకాలను రసాలు, అలంకారాలు మొదలైన తూనికరాళ్లతో తూకం వెయ్యరాదు. ఉంటే అక్కడక్కడ ఉంటాయి. టీ ఏఏ రూపాల్లో ఎలా సమాజాన్ని ఉత్తేజపరుస్తున్నదో దాని రంగు, రుచి, వినియోగం, ప్రభావం, ఆదరణ, సమాజంలో దాని అవసరం మొదలైనవి హాస్యస్ఫోరకంగా చెప్పడమే ఉంటుంది. ఎక్కడో చైనాలో పుట్టి మనకు వ్యాపించిన ఈటీ మన నిత్యజీవితంలో విడరానిదైంది. గుళ్లో తీర్థం తీసుకోనివారూ ఈ **టీ తీర్థం** తీసుకొకుండా ఉండలేరు. ఈ **టీ తీర్థం** పుచ్చుకోవడానికి ఇల్లూ, హోటలూ, బంధుమిత్రుల ఇళ్ళూ, అన్నీ గుళ్లే.

నాలుగురోడ్లకూడలి ఉంటే అక్కడ టీ మధువు లభిస్తుంది. పెద్ద మనుషుల ఒప్పందాల్లోనూ కాంట్రాక్ట్సు ఫైనల్ కావడంలోనూ లంచానికి గౌరవప్రదమైన భాషలో **టీ డబ్బులివ్వండి** ఆది పరిభాషల్లోనూ అలరింపచేస్తుంది టీ. సరిహద్దుల్లో సైనికులనూ ఏకం చేస్తుంది. అబ్బో దీని శక్తి చాలా గొప్పది. అదే ఇప్పుడు మన విట్టుబాబు పట్టుకున్నాడు.

టీ త్రాగుతూ టీ శతకం ఆస్వాదించండి.

విట్టుబాబు మరిన్ని రచనలు చెయ్యాలని ఆకాంక్షిస్తున్నాను. అతడికి మీ అందరి సమక్షంలో ఒక సలహా, వివిధ ప్రక్రియలు వ్రాసే సత్తా విట్టుబాబుకు ఉన్నది కనుక ఆ దిశలోనూ దృష్టి సారించాలని కోరుతున్నాను.

మా విట్టుబాబుకు **నిత్యశ్రీర్నిత్యమంగళం** అగుగాక !

భాషాచరణరేణువు

ఎన్.సిహెచ్. చక్రవర్తి, భద్రాచలం.

డా॥ సూరం శ్రీనివాసులు

'టీ' శతకం

బియ్యపు గింజల మీద బొమ్మలు గీయగలం. మంచు బిందువులపై మమకారాలు కురిపించగలం. 'యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసాసహ' అని మాటలాడలేమంటూనే ఆ పరమాత్మను గురించి ఎన్ని పుస్తకాలు వ్రాశామో, ఎన్ని ప్రవచనాలు చేశామో, ఎన్ని సిద్ధాంతాలు లేవదీశామో అసలు లెక్కేకాదు. ఆ స్థితిలో టీ కప్పు గురించిన పద్యాలు వ్రాయలేమా !

ఆ ఆలోచనయే విట్టుబాబుగారిలో కలిగినట్లుంది. కనిపించిన ప్రతి కాగితం మీద ఇంత టీ క్రుమ్మరించారు. తేలికగా వుందో, గాఢంగా వుందో, పంచదార సరిపోయిందో, లేదో చూడమని పదిమందికీ అందిస్తున్నారు.

తెలుగువాళ్ళకు విలక్షణేతివృత్తాలతో శతకరచన చేయటం అలవాటే. పిల్లిని గురించి ఒక శతకముంది. చీపురు కట్టను గురించిన శతకముంది. కాఫీ దండకముంది. ఇటువంటి వృత్తాలతో రచన సాగినప్పుడు సాధారణంగా హాస్య ప్రధానంగానే కొనసాగు తాయి. స్వల్పంగా భావింపబడేదానికి ఉదాత్తత్వాన్ని కల్పించే ప్రయత్నమే అందుకు కారణం. హాస్యమైన నవరసాలలో ఒకటి గదా! కాకపోతే ఉప్పులాగా హాస్యం లేకపోతే దేనికీ రుచి వుండదు. దాన్ని విడిగా తినగలగటం కొంత కష్టం. అందుకే హాస్యాన్ని ఆస్వాదిస్తూనే చిన్న చూపుచూడటం విశ్వసాహిత్యం లోనే ఉన్న లోపం. సాహిత్యమే కాదు జీవితంలో అయినా అంతే. నవ్వుతూ, నవ్విస్తూ ఉండేవాడిని వాడుకుంటారు. సీరియస్‌గా ఉండేవారికి గౌరవాలు, ఘనతలు దక్కిస్తారు.

అయినా విట్టుబాబుగారు టీ పక్షాన్ని వహించారు. ఎంత ఎత్తునుంచి గ్లాసులో పోసినా తొణకనట్లు ధారాపాతమైన శైలిలో పద్యాలు నడిపించారు. టీ జీవిత చరిత్రను చెప్పారు.

సాయంత్రము వఱకు నహో
నే యంత్రము వోలెఁబనుల నేర్పునఁజేయన్
గాయము నలసిన క్షణమున
మాయలు జేయుదువు నీవు మధురిమతో టీ !

అంటూ టీ ప్రయోజనాన్ని ఉగ్గడించారు. రుచితో పాటు సువాసనను కూడా కవి విస్మరించలేదు.

నినుఁ బెదవుల దాకించక
మునుపే నాసికయు నీదు ముచ్చటలంపన్
గనురెప్పలు మూసుకొనుట
ఘనమగు ప్రతిచర్యగాను గాంచితివా టీ !

చేష్టాపరిశీలన బాగుంది. ఇక చాలు. మీరే చదవండి టీ త్రాగుతూ.....

భవదీయుడు

డా॥ సూరం శ్రీనివాసులు

కంది శంకరయ్య

'శంకరాభరణం' బ్లాగు,

వాట్సప్ సమూహ నిర్వాహకుడు హైదరాబాద్

విట్టీ కవిత్వం

విట్టుబాబుగారిని 'శంకరాభరణం' సమూహానికి ఎవరు పరిచయం చేసారో నాకు గుర్తు లేదు. కాని సమూహంలో అడుగు పెట్టిన నాటి నుండి సంస్కారవంతమైన హాస్యోక్తులతో, సెటైర్లతో, పూరణలతో అందరికీ ఆప్తులయ్యారు. ఇంకా నేర్చుకుంటున్నా నంటారు. కానీ నేర్పగలిగే స్థాయికి ఎదిగారు. వారి పద్యాలు మనోరంజకంగా ఉంటాయి. వ్యాఖ్యలు స్నేహపూర్వకంగా ఆత్మీయంగా ఉంటాయి.

'టీ శతకం'.. ఒక వినూత్నపుటాలోచన, మనకు భక్తి, నీతి శతకాలు లెక్కకు మించి ఉన్నాయి. సరదాగా నల్లి, దోమ, చుట్ట మొదలైన వస్తువులను స్వీకరించి శతకాలను వ్రాసినవారున్నారు. విట్టుబాబు గారి 'టీ శతకం' లో హాస్యం ఉంది. సామాజికాంశాలు ఉన్నాయి. తేనేటి పుట్టుపూర్వోత్తరాలు, లాభ నష్టాలు, సమాజంలో దాని స్థానం, గొప్పతనం విశ్వవ్యాపకత్వం అన్ని వివరంగా కంద పద్యాల్లో అందంగా చెప్పారు. వారు పద్యం చెప్పే శైలి భిన్నంగా, ఆకర్షణీయంగా ఉంటుంది. చదివింపజేసే సుగుణం వీరి పద్యాలలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

పద ప్రయోగంలోను, ధారలోను ప్రత్యేకత కనిపిస్తుంది. టీ గురించి కొన్ని కథనాలు వీరి కల్పనాశక్తికి అద్దం పడతాయి. అలంకారిక శోభకు కొదువలేదు.

స్నేహశీలి అయిన విట్టుబాబు గారి పద్యాలు మనల్ని స్నేహంగా పలకరిస్తాయి. సహృదయులైన పాఠకులు ఈ శతకాన్ని పఠించి తప్పక ఆనందిస్తారని నా విశ్వాసం.

నాకీ మాటలు వ్రాసే అవకాశం ఇచ్చిన విట్టుబాబు గారికి ధన్యవాదాలు తెలుపుకుంటూ, వారింకా చక్కని పద్యకృతులతో సారస్వత లోకాన్ని అలరించాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ......

ప్రస్థానం

తొట్టతొలిని సరదాగాఁ
బట్టితి నొక చిన్నికలము పద్ధతి యేదో
తట్టకయె, వాణి గృహమున
మెట్టితి పదములను బేర్చ మేధ మథించన్.

చిట్టివి పొట్టివి యడుగులు
నట్టడవిని తెన్నెఱుఁగక నడచితి నెటులో
గట్టులఁ దెలియగ నపుడే
పట్టితి శంకర పథమును బదముల నెఱుగన్

పట్టులఁ జెప్పిరి యపుడే
జుట్టుంగొని శ్రీనివాస సూరం గురులే
తుట్టతుదకు మొట్టెను నను
గట్టిగురువు చక్రవర్తి ఘనముగ భళిరే !

విట్టను పేరును గలిగియు
నట్టడుగున నున్న నేను హాస్యము నైనన్
జెట్టగు 'మునగ'ను నెక్కను
జిట్ట చివరనని తెలియును జీమను నేనున్ !

వృత్తిరీత్యా ఎలక్ట్రానిక్ ఇంజనీరునైన నేను ఇంటర్ వరకు తెలుగును చదవడం వలన వ్యాకరణావగాహన ఉన్నది.

ఏదోగాలివాటుగా పదాలను పేర్చుకుంటూన్న నా సరదా వాట్సపు సంభాషణలను చూసిన నా మార్గదర్శి శ్రీ ముద్దు ప్రదీప్ శర్మగారు నాకు పద్యరచనా

గమ్యాన్ని నిర్ణయించి ఒక వాట్సపు బృందాన్ని ఏర్పాటు చేసి నా పద్యరచనాభ్యాసానికి బాట వేసినారు.

అక్కడ శ్రీముద్దు రాజేంద్రప్రసాద్‌గారు, శ్రీ శంకరశర్మగారు, శ్రీఈమని కామేశ్‌గారు తదితరుల మార్గదర్శకత్వంలో తొలి అడుగులు పడ్డాయి.

ఆపైన శ్రీ కందిశంకరయ్య గురువుల పరిచయం. వారి శంకరాభరణం వాట్సపు సమూహం ద్వారా గురువులు శ్రీ చక్రవర్తిగారి వద్ద, శ్రీ సూరం శ్రీనివాసులు గారి వద్ద శిష్యరికం చేసే మహద్భాగ్యం లభించింది. చక్రవర్తి గారి ద్వారా పరిచయమైన శ్రీమతి పాలపర్తి హవీలాగారు నన్ను వారి భద్రగిరి కవులు-ధ్రువకోకిల సమూహాలలో చేర్చారు. అలా భద్రగిరి కవుల సమూహంలో ఈ టీ శతకానికి అంకురార్పణ జరిగింది.

ఇదీ పద్యరచనలో నా ప్రస్థానం.

ఈ క్రమంలో చిన్నతనంలోనే నా చేత కృష్ణశతక పద్యాలను, భగవద్గీత శ్లోకాలను చదివించిన మా అత్తయ్య గోకులానందం గౌరీకాంతంగారు, 'బావుంది' అనే చిన్న ప్రశంసతో పద్య విలువను తెలియజేప్పే మా అన్నయ్యలు శ్రీ పంతుల సీతారామ శాస్త్రిగారు, శ్రీపంతుల నారాయణశాస్త్రిగారు, నా పద్యాలను, కవితలను, పాటలను చదివి విని ప్రోత్సాహిస్తున్న మా మామయ్యలు శ్రీ నాగరాజుగారు, జగన్నాథంగారు, సూర్యనారాయణగారు, నా తమ్ముడు చంటిబాబు(రామ్), రక్తసంబంధం లేకపోయినా అంతకంటే ఎక్కువ బంధం గల మా అన్న శ్రీ ఆసూరి కృష్ణ... వీరందరిని తలుచుకోవడం నా కర్తవ్యం. ఎందుకంటే మనకు ఓ గమ్యం ఏర్పడడానికి ఎవరు ఎలా కారణమౌతారో చెప్పలేం.

ప్రదీప్‌శర్మ గారిని పరిచయం చేసిన మా మేనల్లుడు చిరంజీవి సుధామాధవశర్మను తలచుకోకుండా దీన్ని ముగించడం అసాధ్యం.

నేపథ్యం

నేను పద్యాలు వ్రాయడం వింత అయితే, ఈ టీ శతకం వ్రాయడం విచిత్రం. ఏవో సరదా పద్యాలు వ్రాసుకుంటూ, 'శంకరాభరణం' సమస్యలను పూరించుకుంటూ ఉన్నపుడు మా 'భద్రగిరి కవులు' వాట్సపు సమూహంలో చక్రవర్తి గురువుగారి మిత్రులు శ్రీ నారాయణగారు వారి 'కాఫీ శతకం' లోని పద్యాలు రోజుకొకటి చొప్పున ఉంచేవారు.

వాటికి స్పందనను పద్యరూపంలో తెలియజేసే వాడిని. ఆ తరువాత మరొక వాట్సపు సమూహంలో నారాయణగారి కాఫీపద్యాన్ని, నా స్పందనను పోస్టు చేసినపుడు అక్కడి సమూహ మిత్రులు శ్రీ మిరియాల ప్రసాదరావుగారు, శ్రీ కె.వి.శేషకుమార్ గారు, శ్రీ రాఘవేంద్రరావుగారు తదితరుల ప్రోత్సాహంతో సరదాగా 'టీ' పద్యం వ్రాసాను.

అలా ఆ రోజు నలుగురం పోటీపడి టీ పద్యాలు వ్రాశాం. అలా నేను వ్రాసిన వాటిని గురుదేవులు శ్రీ సూరం శ్రీనివాసులుగారికి పంపినపుడు వారు "తెలుగులో చీపురు శతకముంది. పిల్లి శతకముంది. టీ శతకాన్ని తయారుచేయ"మని సూచించారు.

అలా మొదలైన ఈ రచన గురువులు చక్రవర్తిగారు, సూరంవారు, శంకరయ్యగారు, కవి మిత్రుల ప్రోత్సాహంతో శతకం దాకా సాగింది. ఇప్పుడు మీ చేతులలో పుస్తకరూపంలో ఇమిడింది.

ఇక టీ విషయం

'టీ' నొక వైపునఁ బెట్టియుఁ
దానొక వైపున్న సిరియుఁ ద్రాసున దూపన్
మానసమునకెది యధికము
మానవుడా ! మధురమేది మాపటి వేళన్ !

యాత్రా స్థలమునఁ గనుమను
బాత్రలతోఁ గాచునట్టి పానీయమె టీ
ఆత్రమునఁ బాత్రలంగొనఁ
జిత్రముగా దైవమచటె చేతనమొందున్ !

ఊ! కొట్టక తప్పదు జై
జై కొట్టగఁ దప్పదింక సరదా కైనన్
టీ కొట్టుచుఁ జెప్పునపుడు
టీ కొట్టే కొట్టునైన ఢీ కొట్టునిలన్ !

ఈ శతక పద్యాలలో చెప్పినట్లు చైనాలో పుట్టి అస్సాం నుండి భారతదేశమంతా వ్యాపించిన ఈ టీ కాచని ఇల్లు ఉండదు, త్రాగని వ్యక్తి ఉండదంటే అతిశయోక్తి కాదేమో! గ్రీన్ టీ, బ్లాక్ టీ, అల్లంటీ ఇలా రకరకాల రూపాలలో పొద్దున్న లేచిన దగ్గర నుండి రాత్రి నిదురపోయే వరకు టీ త్రాగే సందర్భాలకు కొదవే లేదు. ఇలా నిత్యజీవితంలోని వివిధ సందర్భాలను ఇందులో ఇమిడ్చే ప్రయత్నం చేసాను. ఈ టీ శతకం పద్య ప్రేమికులను, టీ ప్రేమికులను అలరిస్తుందని నమ్ముతున్నాను.

సుమారు ఐదు నెలల పాటు సాగిన ఈ రచనలో ప్రతీ పద్యాన్ని నిశితంగా పరిశీలించి వాటిలోని తప్పొప్పులను ఎంచి, ఎప్పటికప్పుడు అవసరమైన సవరణలు చేసిన గురువులు శ్రీ చక్రవర్తిగారికీ, శ్రీ సూరం శ్రీనివాసులు గారికీ ఋణపడి ఉంటాను. కొన్ని భావాలను అంత అందంగా చెప్పలేకపోయినప్పుడు నా భావానికి ఏ మాత్రం భంగం కలుగకుండా కీలకమైన సవరణలతో నే వ్రాసిన పదాలతోనే మేలైన పద్యాలుగా మార్చారు గురుదేవులిరువురూ.

ఈ శతకానికి ముందుమాటలను అందించి నన్నాశీర్వదించిన గురుత్రయం శ్రీ నల్లాన్‌చక్రవర్తుల చక్రవర్తిగారికి, శ్రీ సూరం శ్రీనివాసులుగారికి, శ్రీకంది శంకరయ్యగారికీ సాష్టాంగ ప్రణామాలు. ఈ శతకరచనలో ప్రతిక్షణం నన్ను ప్రోత్సహించిన మా భద్రగిరి ధ్రువకోకిల బృంద సభ్యులకూ, పద్యకవులు, పద్యకవిబృందము వాట్సపు సమూహ సభ్యులకూ, బంధుమిత్రులకూ పేరుపేరునా ధన్యవాదాలు.

నమస్సులు...

1. శ్రీకారంబుగ నీకత
నీ కందముగాను వ్రాసి నీ విభవమ్మున్
లోకులు మెచ్చగ శతకము
గా కందములందు వ్రాయ గడcగితి నే టీ !

2. అష్టాదశ వర్ణనలం
దిష్టముగా నీదు ఘనత నే వ్రాయుటకుం
గష్టము లేకుండcగనుమ
మృష్టాన్నముc బోలు శతకమే యిచ్చెద టీ !

3. వందగునో లేదో యీ
ఛందములో పద్యములను చాటగగలనో
యందముగా నీదు ఘనత
విందుగనిడి నిన్ను, జనుల వెంటబడిన టీ !

4. వందగు భావన లిచ్చిన
యందముగాc బలుకులమ్మ నందించెద నే
నెందరి కరముల కను వీ
న్విందగు పద్యాల మాలc బెట్టెదనో టీ !

5. నిను బ్రహ్మయె సృష్టించెనొ
నిను విశ్వామిత్ర ఋషియె నిలిపెనొ ధరలో
కనుగొంటిమి భాగ్యవశత
వనరాజ్ఞీ ! కారుణికవు ! ప్రణతులివే టీ !

6. చీనాలోc బుట్టితివట
చీనాంబరధారులంత చేకొనవలెనో !
యీనాటికిc జీనా, జా
పాను, కొరియ యుత్సవముల ప్రత్యేకమె టీ !

7. తేనీరా ! నీకత విను
చైనా నొక చక్రవర్తి జనహితమునకై
తానే కనుగొనె వింతగ !
నా నాయకుడే 'షినుంగు' నద్భుతమే టీ !

8. వందల వత్సరములుగా
బందీ చీనాను నిన్నుఁ బట్టెడి విధమున్
బొందిన రాబర్ట్ ఫర్ట్యూన్
విందుగఁ గనిపెట్టి తెచ్చె వేగువలెన్ టీ !

9. భారతదేశమునందున
నేరీతిన నిను గనుగొని రెవరెట్టులనో
నారచనన్ జెప్పెద ఘన
సారముగల నీదు చరిత చారిత్రక టీ !

10. అస్సాముననఁ సింగ్ఫో తెగ
నిస్సందేహముగఁ ద్రాగు నినుఁ జూడగనే
బ్రూసోదర ద్వయము గని
యస్సీ ! చైనాకు పోటి యనుకొంటిరి టీ !

11. వనిలో సింగ్ఫో తెగ యా
ఘనమౌ తేయాకుఁ బెంచుఁ గారణమేదో
మణిరాం దత్తా చెప్పగ
విని యా రాబర్టు బ్రూసు వేడ్కంగనె టీ !

12. మరణించగ రాబర్ట్, సో
దరుడగు చార్లెస్సు బ్రూసు తన బాధ్యతగా
నెరనమ్మి నీదు ఘనతను
ధరలో నిలిపెను బ్రియముగధన్యుడులే టీ !

13. చెలరేగి డార్జిలింగ్, కే
రళమున, నా నీలగిరిని, రయమున నూటీ
తలమున, కచారు, కోల్కత
వెలసితి ఘనచరిత నిల్పి వేలనుతుల్ 'టీ'

14. మున్నుగ నా యాంగ్లేయులు
నిన్నిచ్చిరి యుచితమనుచు, నేర్పును గనవే !
నిన్నికఁ బ్రతియింట నిలిపె
హన్నా ! వ్యాపారమదియె ! ఔననవే టీ !

15. నల్లనిదో పచ్చనిదో
తెల్లని పాలను గలసిన తేనీరదియో
చల్లనిదో వేడిదొ మన
యుల్లము నే దోచి ఘనత నొందెనులే టీ !

16. సాయంత్రము వఱకు నహో !
నే యంత్రము పోలెఁ బనుల నేర్పునఁ జేయన్
గాయము నలసిన క్షణమున
మాయలు జేయుదువు నీదు మధురిమతో టీ !

17. కార్యాలయమున గంటల
పర్యంతముఁ బనులఁ జేయుఁ బద్ధతిలోనన్
బర్యాయంబుల నినుఁగొన
నిర్యాణమ్మొందు నిద్ర నిక్కముగా టీ !

18. అక్కవొ చెల్లివొ యెదిరివొ
చక్కని కాఫీకి సఖివొ సహచరి వీవో
చిక్కని చుక్కవొ చిక్కిన
మక్కువతో సేదఁదీర్చు మాధురివే టీ !

19. ఉపవాసముననను, వ్రతమున
నపవాదము రాదు నిన్ను నాస్వాదింపన్
కపటము నెఱుగవు తనువున
కుపకారము సేతువీవు నొద్దికగా టీ !

20. వచ్చిన నతిథులు గీముకు
వచ్చిన నా బంధుమిత్ర పరివారములే
యిచ్చెదము వేడిగా నిను
రెచ్చిన సంతోషమందు లెక్కెఱుగక టీ !

21. చెడు నారోగ్యమటంచును
మడిఁగట్టుకు దూరముండు మనుజులు నిన్నుం
గడిఁగొన నొకపరి తెలియును
మిడిమిడి తలపులని యెఱిఁగి మెలగెదరే టీ !

22. మలబద్ధకమనెడి జనులు
తెలవారకమున్నె లేచి తేటగ నిన్నే
జలమును గొని పిదపఁ గుడువఁ
జెలగుచుఁ దీర్చెదవె చింత జేజమ్మా టీ !

23. మా వ్రాతలు మారుటకుం
జేవ్రాలును మార్చుకొను విచిత్రజనుల మౌ
రా ! వ్రాలక బ్రతుకు నిలుప
టీ వ్రతమున్ దగును గదటె టీకృతి నో టీ !

24. కుదిరెడి బేరము గాదులె
మదినుండియుఁ దీసివేయ మాకర్మమిదే !
విధిగా సేవింపవలయు
వదలక; పారణయె గాని వ్యసనమ్మా ? టీ !

25. సుద్దులఁ జెప్పెడి తరుణము
బుద్ధులనే బాగుఁజేయఁ బూనిన వారున్
విద్దెలు నేర్పెడి వారికి
బుద్ధిగ నిన్నీయఁజూడ, బోధనమే టీ !

26. ఆషామాషీ కాదే
భాషా వ్యవసాయము ధర బాసట యగుచున్
తోషమునిడి మాకవులకుఁ
బోషణనిచ్చెదవు గానఁ బొగడెదమే టీ !

27. సందేహము వలదు హనుమ
సందరమును దాటఁగలవు సాధ్యంబనుచున్
బందీ సీతమ్మను గన
నింధనముగ జాంబవంతు డిచ్చెనొ నిను టీ !

28. సంతసములఁ బొందునపుడుఁ
బంతములను నెగ్గునపుడుఁ బదుగురు గూడన్
వంతలఁ బాడుచు నందరు
వింతయ ! నీ పార్టి యనుట విశదమెగా టీ !

29. నీ రసమే నీరసమును
పారగఁద్రోలును నరులకుఁ బావనమగుచున్
గోరిన వారలఁ దీర్చుచుఁ
గ్రూరములౌ వేదనలను గూల్చితివే టీ !

30. ఆ హైదరబాదు నగర
బేహారుల యా యిరాని పేరొందిన సా
మూహిక విక్రయ శాలల
స్నేహాలను గంటినమ్మ చిక్కగనో టీ !

31. నిను౦ బెదవుల౦ దాకించక
మునుపే నాసికయు నీదు ముచ్చటలంపన్
గనురెప్పలు మూసుకొనుట
ఘనమగు ప్రతిచర్యగాను గాంచితివా టీ !

32. ఎన్నియొ వర్తక సంఘము
లెన్నియొ పేరులను బెట్టి యెన్నియొ రీతుల్
మిన్నగు నీ చెలుల౦ గలిపి
యెన్నుకొనగ నమ్మబోరె యెత్తులహో టీ !

33. మరగించి నీ కషాయము
కరగించుచు౦ బంచదార౦ గడిగొనునపుడున్
నెర నిమ్మకాయ౦ బిండిన
సరిరాదిక తోషమునకు స్వర్గమ్మే టీ !

34. బడికిం బోయెడి పిల్లలు
నిడమందురు గొడవ౦బెట్టి ! యిక్కట్టులివే !
చెడగొడితివి మనములనే
పడదిక చద్దన్న మనిన౦ బద్ధతియా టీ !

35. పలుదోమిన౦ బరగడుపున౦
దలి యిచ్చును ప్రేమమీర౦ దనయుకు నిన్నే
చెలి ప్రియసతి యిత్తుననున్
దొలిగా తిని మిగులునంట్లు తోమిననే టీ !

36. గాడిద చాకిరి సేసియు
వేడిగ నే రూపమునను విసుగున౦ గొనినన్
వాడిగ౦ జెండాడెదవే
వీడగ నే వేదననిక, విక్రమతన్ టీ !

37. నింగొనిన వారు సురులగు
నింగరమునఁ బట్టువారు నేర్పరులగునే
నింగోరని నరులు మిగులు
సంగోరుగ, పూర్ణులగు టసాధ్యములే టీ !

38. తెలవారినఁ బడక దిగక
నలివేణియు నిచ్చు నిన్ను నాత్రత చేతన్
బలుదోమక త్రాగునపుడుఁ
జెలరేగును పాచికంపు ఛీ ! యనవా టీ !

39. తూరుపున నెఱ్ఱ వానిగ
నా రంగుల ఱేడు రాగ నద్భుతమగు నిన్
జేరం గను మానసముం
గోరగనే దివినిఁ దేల్చు కోమలివే టీ !

40. రహదారిన టీ కొట్టున
నహరహముం బూటకూళ్ళ యంగడి లోనన్
విహితములే నినుఁద్రాగుట
రహి వుట్టద నాట్యమాడు రసనంగొన టీ !

41. సాకారముఁ జేసికొనగ
మా కలలం బోవు మేలు మార్గములందున్
నీ కొట్టే కంటఁబడిన
మా కాళ్ళటు లాగు ముమ్మ మాయవులే టీ !

42. గోధుమ వర్ణపు దానా !
బాధలలో తోడువైతి బంగరుదానా !
మేధను మధించు జాణవె
సాధకబాధకములందు సంసారికి టీ !

43. నినుఁ ద్రావినఁ దేలు మనము
నినుఁ ద్రావిన బద్ధకంపు నీరసము విడున్
నినుఁ ద్రావిన మత్తు వదలు
నినుఁ ద్రావిన నాకమికను నేలకు దిగు, టీ !

44. నినుఁ ద్రావితి నియమంబున
నినుఁ ద్రావితి మరులుగొంటి నిక్కితి నేనే
నినుఁ ద్రావితి ప్రతి దినమున
నినుఁ ద్రావితి ధన్యుడైతి నేర్పరివే టీ !

45. నినుఁ ద్రావని వారు నరులె ?
నినుఁ ద్రావని వారి మనము నిస్తేజములే
నినుఁ ద్రావని బ్రతుకు వృథా
నినుఁ ద్రావని వారి సిరులు నిష్ఫలమే టీ !

46. ఘాటగు మిరియపు గింజల
నీటను మరగించి గుడము, నిను గలుపంగాఁ
బూటకుఁ బూటకుఁ ద్రావిన
నోటిల్లద రోగజాలమో బెల్లం టీ !

47. నినుఁ గొన లాభాలెన్నో
నినుఁ ద్రావిన రక్తపోటు నిలకడగనగున్
మనమున నుత్తేజమలరు
దనుపు నడచి గుండెపోటు ధన్వన్తరి టీ !

48. నీలో ఫ్లోరైడు గలదు
నీలో ఫ్లెవనాయిడుండు నిలుపును గుండెన్
'ఫ్లూ'లిక దరి జేరవులే
నీలోన గల థియనైను నెచ్చెలిలే టీ !

49. నీచే నామ్లత పెరుగున్
నీచే నిక క్రుంగుబాటు, నిద్రయు రాదే !
నీచే నాకలి తగ్గును
నీచే నష్టములు గలవు నిజమేలే టీ !

50. స్త్రీసాంగత్యము, సారా
సీసా, జూదమ్ముబోలుజిన్నెల కన్నన్
నీసాంగత్యము ధరలో
వేసారిన వారికిచ్చు వే మరులే టీ !

51. కూలీలున్ యామికులున్
పాలేరుల్, పనులవాండ్రు ఫలితము గొనుచున్
జాలదు లెండని జీతము
జాలిగ టీ కాసులడిగి జారెదరే టీ !

52. అత్తల మనములు గెలువగఁ
గ్రొత్త రకపు రుచులు గోరు కోమలులుం దా
ముత్తమమౌ రీతినిఁజెలి
కత్తెగ నినుఁ జేతఁ బెట్టి కాచెదరే టీ !

(ఇక్కడ టీ కాచడంతో పాటు అత్తలను జాగ్రత్తగా చూసుకుంటారనీ కూడా. కాచు అంటే రక్షించు అని కూడా అర్థం కదా!)

53. కనవే ! కనుగొనవే చెలి !
ధనియాలను బిండి చేసి దట్టించినచో
ఘనవైద్యము సేయునహా ?
వనినెండిన పుల్లలేరి వండినచో టీ !

54. ఏలకుఁ గుంకుమపూవున్
మాలిమితోఁ బాలఁగలిపి మరగించినచో
మేలిమి తేయాకులతోఁ
దాలిమితో మిమ్ముగాచుద్రాగిననే టీ !

55. దాల్చినచెక్కను ద్రవమునఁ
దాల్చిన దానవు మసాల తళుకెందులకే !
కూల్చెదవే మధుమేహము
దేల్చుచు వడగట్టి త్రాగ తేనీరా ! టీ !

56. మొగమాటము లేలనొ నీ
వెగబడరా కాంచినంతనే టీకప్పున్ !
సొగసరి, పెండిలికొడకా
యగపడ నా రంభవోలె ! నని నీతో టీ !

57. వేడగ నీశుని మోక్షము
జాడగ శివరాత్రి నాటి జాగరణమునన్
వాడగనీయక నరులను
గూడెదవే తోడు నీడ గొప్పవులే టీ !

58. పుట్టెడి గిట్టెడి జనులకుఁ
బట్టుబడని పరమతత్వ పరమార్థములే
చిట్టడవిని కనుగొని నినుఁ
బట్టుకు సుర గ్రోలినంతఁ బట్టుబడెను టీ !

59. పుట్టిన జీవికి మరణము
గట్టెను పరమాత్మ బొంది గట్టిన నాడే
గిట్టుట యెరుగవు బ్రహ్మయె
గుట్టుగ నమరత్వమిచ్చె కోరితివా టీ !

60. ఏ చుట్టము గనిపించిన
నే చక్కని సందెవేళ నే కళనున్నన్
రా ! చక్కగ త్రాగెదమని
టీ చుక్కన సాగునేమొ టెక్కుల పోటీ !

(ధర నేనిస్తానంటే నేనిస్తానంటూ ఆత్మీయమైన వాదులాట)

61. టీ కొట్టున గ్రామప్రజ
జో కొట్టర చింతలఁ బరిశోధనలందున్
దాకట్టుల యప్పులనట
టీ కొట్టుచుఁ దేల్తురేమొ టిప్పులతో టీ !

62. టీ కొట్టు చట్ట సభయగు
జైకొట్టర చిన్న పెద్ద సరి ! జాతరలో,
నాకట్టుకొనగ నూరున
టీకొట్టుండొకటి యైన డింగరివే టీ !

63. టీ కొట్టే యాటవిడుపు
టీ కొట్టే గమ్యమింక డీలా పడకో
టీ కొట్టే యమృతవనము
టీ కొట్టే సకల జనుల డెందములన్ టీ !

64. చిక్కదనము, రంగును, రుచి
చక్కదనపు పొంగులీను జాణవు నీవే
లెక్కయె జేయని మనుజుల
తిక్కను భరియించవమ్మ త్రీ రోజెస్ టీ !

65. చక్కని దానవు ! కరముల
చిక్కిన దానవు ! దగిలిన జిమ్మకు సుఖమున్ !
జిక్కని దానవు సరసీ !
చెక్కిన నీ తీపిముద్దు చెలువము పో !టీ !!

66. పాలను మరగించునపుడు
నేలకులను దంచి యల్లమే కలుపంగా
గ్రోలంబోవుటకు మునుపె
నీ లావణ్యమును జూసి నే మురిసితి టీ !

67. తలనొప్పికి మందువు ! బా
ధల మునిగిన మానసంబు, దాపము గలుగం
దలతుము నిన్నే ఝరి ! భూ
తలమందున హేలవమ్మ ! తాపసివే టీ !

68. ఏదారియు లేనప్పుడు
గోదారినిఁ గలసినపుడుఁ గూలిన బ్రతుకుల్
సేదనుఁ దీరుట కొఱకై
నీదారియె బట్టు నిజము నెమ్మదివే టీ !

69. కొందరు జుర్రని బీల్తురు
కొందరు నినుఁ జప్పరించి కొనియాడెదరే
కొందరు చక్కెర బోతురు
కొందరు చక్కెరయె లేక కోరెదరే టీ !

70. నీ మిత్రులు బజ్జీలా
సౌమిత్రినిఁ బోలువార జంతిక, పకొడీ
యా మధురపు బిస్కత్తులు
క్షేమంబా ! కారపూస చేగొడులున్ టీ !

71. సభయో, సంకుల సమరమొ,
విభవము గల వారు గలియ వీలగు చోటో
శుభకరమౌ నినుఁ ద్రావగ
నభములఁ దేల్చెదవు నీవు నచ్చితివే టీ !

72. కలవారు లేనివారని
దలతువ ? యలరింతువీవు ధాత్రీ జనులం
బొలతులఁ, బురుషులఁ, బిల్లల,
కులమత బేధములు లేని కోణంగివి టీ !

73. నగరమునను సైకిళ్ళను
భగభగమను నిన్ను గట్టి ఫ్లాస్కుల లోనన్
దెగనమ్ముచుఁ దిరుగంగా
ధగధగ సంపదలనిచ్చు ధన్యవులే టీ !

74. తలవంచుచుఁ గైకొనరా
చలి వేసవి వర్షకాల సాయపు వేళన్,
దెలవారు సమయములలో
సలసల కాగించి నిన్ను జవరాలా టీ !

75. పారా గాచెడి వీరుడు,
పారాయణ సేయునట్టి పండితుడైనన్
నారాయణ ! నారాయణ !!
గారముతో నందుకొనర కాఫీతో టీ !

76. బంధువు వోయిన నేడ్చుచు
బంధమ్ములఁ దలచుకొనెడి బంధుజనమ్ముల్
గుందుచు నినుఁ గొను క్షణమున
బంధమ్మును మరతురెటుల బహుచిత్రమె టీ !

77. మత్తుకుఁ జిక్కఁదనానికి
చిత్తమునకు వచ్చునట్లు చేర్చుచునేవో
సొత్తుకు నమ్మిన వణిజులు
చిత్తైతిమి నిన్ను గ్రోలి చేదువు ధమ్ టీ !

78. పర్వంబులఁ బాయసమున్
గర్వంబున నీల్గుచుండుఁ గనువిందనుచున్
పర్వంబొకటె తనకు ని
ర్గర్వీ ! నినుఁ బ్రతిదినమ్ముఁ గాచెదరే టీ !

79. వార్వపువు టగ్గి ప్రమగ్గుచు
సర్వులకును శ్రేయమొసగు సంతప్తరుజా !
ఉర్వీజజాతిఁ బుట్టియు
నుర్వీధరమంత కీర్తి నొందితివే టీ !

80. ఏకాంతముగాఁ గూర్చొని
యో కప్పెడు నిన్నుఁ గ్రోల నొప్పులకుప్పా
శ్రీకరములు శుభకరములు
సాకారములగును గాదె స్వప్నములున్ టీ !

81. పలువిధ దీక్షలు ప్రబలెను
బలువురు దేవతల పేర, వలువల పేరన్ !
తులలేని నీదు సేవన
మిలలో గొననాదు దీక్ష యెంచక్కటి టీ !

82. పానీయంబుల చెంబులు
నా నియతిని గూల్చలేవు నాణ్యపు ద్రవమా !
తేనీరా ! ఛాయీ ! యని
నీ నామమె భజన సేతు నిత్యము నే టీ !

83. సెహబాసు చారుశీలా !
మొహమాటమునైన గొనిన మోహము పుట్టున్
బహువిధ రూపంబుల నీ
యిహలోకపు వర్తనమ్ము నేమందును టీ !

84. నిను నమ్మినవారలె నీ
ఘనమగు సహకారమె తమ గతచరితముగా
వినుతికి నెక్కిరి, భారత
జననాయకులైరి, మాకు జయమిమ్మా టీ !

85. అమృతము నమరులకమరగ
నమితంబౌ సురయు దక్కె నా యసురులకున్
విమల తనువునం బుట్టిన
మమకారమ ! దక్కితీవు మానవులకు టీ !

86. నీరము జగదాధారము
నీరమునన్ నిత్యు జన్మ నీరమె బలమౌ
నీరము నీకాధారము
నీరమునన్ నీదు జనియు నీ బలిమియు టీ !

87. నారము నందున బుట్టితి
నారమునకు తోడువైతి నయముగ నీవున్
నారాయణ సోదరి నినుఁ
బారాయణమందు గొనుటఁ బద్ధతియే టీ !

88. తోయము మరుగంజేసియుఁ
దేయాకుల నందు వేసి తేర్చిన పిదపం
దీయని జక్కెర జేర్చిన
హాయినొసగు రూపునొంది యమరుదువే టీ !

89. సులువగు పోరేది ? యనిని
గెలుపోటములం దెలియగఁ గిటుకులు గలవే ?
గెలిచిన నోడిన వారుం
దొలి నిను జేపట్టువారు తోరముగా టీ !

90. సుజనమనోహరి - సహచరి,
సుజలాంగీ, చిన్మయి, రసశోభిత, లీలా
విజయవిలాసిని, పావని
రజనీముఖ సేవిత, మృదులాహిరి యో టీ !

91. జయహో నీలోదకమా
జయహో లలితస్వరూప జనబాంధవి జే !
జయహో సువర్ణశోభిత
జయహో తోషప్రదాయి సౌహార్దమ టీ !

92. ఎప్పుడు మొదలిడితినొ తొలి
కప్పునెపుడు చేతఁ బట్టఁగలహించితినో
ముప్పిరిఁగొను మోహముతో
నప్పుడె బానిసను నీకు నయితినిగా టీ !

93. ఎండలు మండుత, జనులం
జెండాడుచు నుక్కపోత చెలరేగుత, మే
మొండేమి యుఁగోరము, మా
గుండెలలో నున్న నిన్నుఁ గ్రోలక యో టీ !

94. నీ లాలస నాలుకకే
నీలపు నీరంగు కనుల నిండుగ నిలుచున్
నీలా లయమగు నేదిల
నాలో రసనీయభావనందనమా టీ !

95. నీవే నా చేతులలో,
నీవే నా గుండె గూటి నెచ్చెలి, గనవే !
నీవే నా యిహము పరము
నీవే నా తోడు నీడ నిజముగనే టీ !

96. తెలియక జ్ఞాతులు హాలా
హలమని భయపడుచు నాడు హర ! యని పిలువన్
దెలివిని నీవని యెఱిఁగిన
నెలతాలుపు త్రాగెనేమొ నేరుపునన్ టీ !

97. అడవిని గల జంతువులున్
గడలిని గల జలచరములు గగనవిహంగాల్
మిడిసిపడుట కేమున్నది
కుడువవుగా నిన్ను జాణ కోరికమై టీ !

98. పొయ్యిని మరగించునపుడుఁ
జుయ్యని శబ్దంబు వచ్చు సూత్రము చేతన్
దొయ్యలి నినుఁ గాచునపుడు
నయ్యహొ! నీ వాలకమ్మొ యబ్బురమౌ టీ !

99. శ్రీపతి గిరిజాపతి యే
మాపటి వేళను గలసిన మాటల నడుమన్
దీపిగ నినుఁ ద్రావుచుఁ దమ
వౌ పాటులఁ జెప్పుకొందు రౌనుగదా టీ !

100. కరమున నిన్బట్టక శుభ
కరమగునా మానవులకు కర్మములెల్లన్
కరదీపికవే గైకొన
కరకర చిరుతిళ్ళతోడు కాదనమే టీ !

101. నీ రుచి నెఱుగక రసనయె ?
నీ రంగును గనని కనులు నేత్రములగునే !?
నీ రాశిని బట్టము తే
నీరా ! యన కరములగునె ? నికరంబా టీ !

102. తిరునల్వేలిని హల్వా
నరిగించగ నిన్ను ద్రావుటది యొక క్రమమే !
అరయగ నా వింత రుచియు
నరులకు నినుఁ బట్టఁదోచు నది వరముగ టీ !

103. తేనియఁ బోలిన రూపము
తేనియ నామంబె నీది తేనియలొలుకున్
తేనీపుర చుట్టరికము
తేనీరా తేలునెట్లు ! తెలిపెదవా టీ !

104. వడి నినుఁ గుడువని నడవడి
గడినిడి మడితడి యనియెడి కడు కఠినులకున్
నుడివెద నగపడి కలివిడి
తడబడకను త్రాగుటొకడె తగు జడి నని టీ !

105. చలిపులి వణికించునపుడుఁ
దొలకరి తొలి పలకరింపు తొణికినవేళన్
జెలి నిన్నా లోనైక్యము
మలి చర్యగఁ జేసికొనెద మాలిమితో టీ !

106. కలమించుక కదిలించిన
నలలం బోలుచును నూహ లావృతమగుచున్
జెలగుచు పద్యము లాయెనె
యిల నూరేండ్లకు శతకము నెచ్చెలునే టీ !

107. ఎన్నో శతకమ్ములు గల
వెన్నో ఛందమ్ములందు నే వేల్పులనో
యెన్నుచు వ్రాయంగఁ గవుల్
పన్నుగ నిన్నెంచుకొంటిఁ బ్రాణసమా టీ !

108. కుతకుత లాడెడి నీపై
మితిమీరని భావరాగ మేళనములతో
శతకము వ్రాసితి జనస
మ్మతికయి, నీరీతి నోళ్ళ మనవలెనని టీ !

కె. యల్. నారాయణ,
విజయవాడ

విట్టీయం

ఏకాక్షర పానీయము
మేకొని నూటెనిమిదింటి మెరుపులు చిలుకన్
టీ కందమ్ముల పొదిగియు
లోకులకిడె పలుకు దేనెరుచుల గలిపియున్!

కందువగు తెన్గు పలుకుల
పొందికగా గూర్చి టీయమోఘపు రుచులన్
కందమ్ముల నందముగా
నందించెను విట్టుబాబు నానగ జగతిన్!

నూతన భావప్రదములు
చేతన నుప్పొంగి పొరలి చిత్తమధురిమన్
లేతనగవు దోహజమున
ప్రీతికషాయంబు గల్పివేడిగనిచ్చెన్!

ఎక్కడి దీ మాధుర్యం
బెక్కడిదీ చిక్కదనము హృదయము పొంగన్
చక్కని కలకండ పలుకు
మక్కువ మీరంగ పొదివి మనకిట నిచ్చెన్

పొద్దు గూటికి చేరెడి పొద్దునందు
సంజకెంధూళికాంతుల సరకమాని
శ్వేతపాత్రల తేనీటి విందుగూర్చి
జగతి నుత్సహపరచగ జనత కొసగె!

శ్రీగిరినివాసు దాపల
భాగమ్మున నిలచియున్న భ్రామరి కవికిన్
తీగమెరుపు భాగమతికి
దా గరిమను నిచ్చుగాక ధన్యత నొసగన్

VITTUBABU'S
Telugu Poetry
Tea Sathakam

తల్లిదండ్రులు :
పంతుల జయలక్ష్మి ,
కీ॥శే॥ పంతుల భాస్కరరావు

జన్మస్థలం :
గుణానుపురం అగ్రహారం, పార్వతీపురం
విజయనగరం జిల్లా

స్వస్థలం :
నెల్లిమర్ల, విజయనగరం జిల్లా

ఉద్యోగం :
జనరల్ మేనేజర్, కురుగంటి కంప్యూటర్స్ ప్రై.లి.
చెన్నై

ప్రవృత్తి
"శంకరాభరణం" పూరణలు
సరదా పద్యాలు, వచనకవితలు, గేయాల రచన